
సాక్షి ఒడిశా
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2.37.223 లు, వెండి 33 గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రెండోరోజు కొనసాగిన ఐటీ దాడులు

రాష్ట్రంలో లిక్కర్ బ్రూయింగ్ కంపెనీ బౌద్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సంబంధం కలిగిన వివిధ ప్రాంగణాల్లో రెండోరోజు గురువారం ఏకకాలంలో ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారుల దాడులు కొనసాగాయి.

8లో▸



పంటనష్టం అంచనా వేయండి

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో కలిగిన పంట నష్టం అంచనా వేయాలని కలెక్టర్లకు ప్రత్యేక సహాయ కమిషనర్ సత్యబ్రత సాహు ఆదేశించారు.

8లో▸

న్యూస్‌రీల్

రహదారి నిర్మాణానికి సన్నాహాలు

భువనేశ్వర్: పూరీలో భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం వారసత్వ ప్రాకారం ప్రాజెక్టు కింద 800 మీటర్ల రహదారిని నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ రహదారి నిర్మాణం పురస్కరించుకొని ప్రజాభియోగాల సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సముచిత పరిహారం చెల్లించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ప్రణాళిక ప్రకారం శ్రీజగన్నాథ వల్లభ్ పార్కింగ్ స్థలం నుంచి జగన్నాథ దేవాలయం డోలో వేదిక వరకు 80 అడుగుల వెడల్పు రోడ్డు నిర్మించాల్సి ఉంది. దీనికోసం దాదాపు 1.14 ఎకరాల విస్తీర్ణపు స్థలం సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో 84 కుటుంబాలు కొత్త రోడ్డు నిర్మాణంతో నిర్వాసితులవుతారు. రహదారి నిర్మాణ స్థలంలో 68 శాతం శ్రీజగన్నాథ స్వామి లేదా రాష్ట్ర ప్రభుత్వానికి చెందినది కాగా, 32 శాతం ప్రైవేట్ వ్యక్తులకు చెందినది. ప్రైవేట్ భూమిలో చూడంగ వీధి లో 66 కుటుంబాలకు 0.87 ఎకరాలు, దండిమాల సాహిలో 18 కుటుంబాలకు చెందిన 0.26 ఎకరాల విస్తీర్ణ స్థలం ఉంది. తమ పూర్వీకుల ఆస్తులు ప్రజా ప్రయోజనం కోసం త్యజించేందుకు సిద్ధంగా ఉన్నామని బాధిత కుటుంబాలు తెలిపాయి. అయితే ప్రభుత్వ పునరావాసం మరియు పునర్వ్యవస్థీకరణ (ఆర్అండ్ఆర్) విధానం ప్రకారం వారికి తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిహారంగా రూ.50 లక్షలు ఇవ్వాలని, మార్కెట్ ధర ప్రకారం భవనం ఖరీదు, 1 డెసిమల్ విస్తీర్ణం స్థలానికి రూ.1 కోటి చొప్పున పరిహారం చెల్లించాలని ప్రతిపాదించారు. ప్రాజెక్టు కోసం ప్రభుత్వానికి తమ అందరి మద్దతు ఉందని, నిర్వాసిత కుటుంబాలు తమ ఆసక్తిని కూడా పరిశీలించాలని అన్నారు. నష్టపరిహారం కోసం తమ డిమాండ్‌ను నెరవేర్చకుంటే వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగుతామని సుతిమెత్తగా హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో జవాన్ మృతి



రవికుమార్ (ఫైల్)

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి రాణిపేట గ్రామానికి చెందిన జవాన్ పిల్ల రవికుమార్ (36) గ్వాలియర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో రవికుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వాహనంపై వెళ్తున్న సమయంలో గత నెల 27న ప్రమాదానికి గురవ్వడంతో మృతి చెందాడు. ఆయన పార్థివ దేహాన్ని బుధవారం రాత్రి పర్లాకిమిడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాణిపేట గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్‌లు విచ్చేసి నివాళులర్పించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బేజంగవాడ పంచాయతీ బాపాన్‌పల్లి గ్రామానికి రహదారి పక్కన గురువారం ఉదయం ఒక గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. గత రెండు రోజులుగా మృతి చెందిన వ్యక్తి ఈ ప్రాంతంలో తిరుగుతూ కన్పించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వర్షం, చలికి తట్టుకోలేకనే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అతడు చత్తీస్‌గఢ్‌కు చెందినవాడిగా తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఉపాధ్యాయుడి అవతారమెత్తిన సబ్ కలెక్టర్



పాఠాలు చెబుతున్న సబ్ కలెక్టర్ పరిడ

జయపురం: సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ ఉపాధ్యాయుడు అవతారమెత్తాడు. ఆయన కుంద్రా సమితి ఉదలగుడ కేడీఎఫ్ ఆదివాసీ కన్యాశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం 7, 8 తరగతుల విద్యార్థినులకు గణితం, సైన్స్, ఒడియా సబ్జెక్టులను బోధించారు. ఆయనతో పాటు కుంద్రా తహసీల్దార్ బినోద్ నాయిక్ ఉన్నారు.



అసురబందా అదివాసీ గ్రామంలో కూంబింగ్



నిశ్శబ్దంగా కేరుబడి గిరిజన గ్రామ పరిసరాలు



దరింగబడిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న జవాన్లు

ఆదివాసీల్లో అలజడి



దరింగబడిలో చెట్టుకు అతికించిన మావోయిస్టుల హెచ్చరిక పోస్టర్

- కొనసాగుతున్న గెరిల్లా వారోత్సవాలు
- ప్రజాకోర్టుకు హాజరవ్వాలని పోస్టర్లు
- గిరిజన గ్రామాల్లో జల్లెడ పడుతున్న పోలీసులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆదివాసీలు



కెరుబడి ఘాట్ రోడ్డులో సీఆర్పీఎఫ్ జవాన్ల కూంబింగ్



బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న గిరిజనులు

బరంపురం: ఒకవైపు మావోయిస్టుల వారోత్సవాలు.. మరోవైపు పోలీసుల తనిఖీలు గిరిజనులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో ప్రశాంతంగా ఉంటున్న ఆదివాసీ గ్రామాల్లో అలజడి నెలకొంది. మావోయిస్టు పార్టీకి చెందిన ప్రజా విముక్తి గెరిల్లా దళం(పీఎల్‌జీఏ) వారోత్సవాలు 5 రోజులుగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టుల దుర్గంగా పేరొందిన కొందమాల్ జిల్లాలో హై టెన్షన్ నెలకొంది. కేకేబీఎన్ (కొందమాల్-కలహండి-బౌద్-నయాగఢ్) జిల్లాల సరిహద్దు ఆదివాసీ గ్రామాల్లో మావోయిస్టు శిబిరాలు జోరుగా నిర్వహిస్తున్నారు. గజలబడి, ఆసురబందా, బంజనగర్ తదితర ప్రాంతాల్లో వివిధ విభాగాలకు చెందిన 10 మంది పేర్లతో పోస్టర్లు విడుదల చేశారు. వీరంతా ప్రజాకోర్టుకు హాజరవ్వాలని, లేదంటే దండన తప్పదని సీపీఐ మావోయిస్టు పేరుతో జిల్లా సరిహద్దుల్లో చెట్లపై, గోడలపై పోస్టర్లు ప్రజలకు దర్శనమిచ్చాయి. అదేవిధంగా దరింగబడి పోలీసుస్టేషన్ పరిధి కిరుకుటి, పంటాంగి గ్రామాల శివారులో సైతం పోస్టర్లు వెలుగులోకి వచ్చాయి. దీంతో సమాచారం అందుకున్న దరంగబడి పోలీసులు మావో పోస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బడుగు, బలహీనవర్గాల హక్కులను కాలరాస్తున్న భూస్వాములకు కొమ్ముకాస్తూ, అవినీతికి పాల్పడుతున్న వ్యక్తులు తప్పనిసరిగా ప్రజాకోర్టుకి హాజరవ్వాలని లేఖలు కూడా అందినట్లు తెలుస్తోంది.

భద్రత కట్టుదిట్టం

మావోల హెచ్చరిక పోస్టర్లతో కొందమాల్ జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో భద్రత కట్టుదిట్టం చేశారు. గంజాం, గజపతి కందమాల్ జిల్లా సరిహద్దులో వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. దీంతో పాటు కొందమాల్‌లో కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరం చేసినట్లు కొందమాల్ జిల్లా దక్షిణాంచల్ డీఐజీ సత్యబ్రాత్ బోయి తెలియజేశారు.

మరోవైపు మావోయిస్టుల కార్యకలాపాలను అడ్డుకునేందుకు సీఆర్పీఎఫ్, ఎస్‌వోజీ జవాన్లతో గంజాం, గజపతి, కొందమాల్ జిల్లాలతో పాటు బౌద్, నయగడా జిల్లాల్లో జల్లెడ పడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో గిరిజనుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి చందంగా ఉంది. మావోయిస్టులు, పోలీసుల చర్యలతో ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. తమకు కనీసం కంటి నిండా కునుకు లేకుండా పోతోందని వాపోతున్నారు.

వణికిస్తున్న చలిపులి

- మిచాంగ్‌తో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం



భువనేశ్వర్: దక్షిణ చత్తీస్‌గఢ్, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం బలహీనపడింది. ఇది రాష్ట్రంలోని వాతావరణంపై విపరీత ప్రభావం చూపుతోంది. ఫలితంగా గురువారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పొగ మంచుతో కూడిన వాతావరణం నెలకొందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత 2 రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మిచాంగ్ ఆంధ్రప్రదేశ్‌లో తీరం దాటిన తర్వాత కొరాపుట్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. తుఫాన్ వెంబడి తదుపరి వర్షాలతో రాష్ట్రంలోని కొన్ని ప్రదేశాల్లో ఉష్ణోగ్రత 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గుముఖం పట్టింది. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో విస్తృతంగా కురుస్తున్న అకాల వర్షాలు రాష్ట్రమంతటా ఉష్ణోగ్రతను తగ్గించాయి. తదుపరి 2–3 రోజుల్లో రాత్రి పూట ఉష్ణోగ్రత 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గుతుందని భువనేశ్వర్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. గత 24 గంటల్లో ఉత్తర ఒడిశాలోని కొన్ని చోట్ల, దక్షిణ కోస్తా ఒడిశాలో ఒకటి, రెండు చోట్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడం గమనార్హం. కొరాపుట్‌లో అత్యల్పంగా రాత్రి పూట ఉష్ణోగ్రత 12.5 డిగ్రీల సెల్సియస్, సుందర్‌గఢ్ జిల్లాలోని కెరీలో 14.5 డిగ్రీల సెల్సియస్, దారింగ్‌బాడి, సుందర్‌గఢ్ ప్రాంతాల్లో 15 డిగ్రీల సెల్సియస్, ఫుల్బాణి, అంగుల్, బౌద్, జి.ఉదయ్‌గిరి, నువాపడా ప్రాంతాల్లో 16 డిగ్రీల సెల్సియస్ రాత్రిపూట ఉష్ణోగ్రత నమోదైంది. భువనేశ్వర్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రత 18.2 డిగ్రీల సెల్సియస్, కటక్‌లో 19 డిగ్రీల సెల్సియస్‌కు దిగజారింది. గోపాల్‌పూర్, ఛత్రపూర్, పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, చాంద్‌బాలి సహా తీరం వెంబడి కొన్ని ప్రాంతాల్లోనూ గత రాత్రి 20 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదైంది.

శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో మంటలు



రైలు కింద మంటల వస్తున్న దృశ్యం

భువనేశ్వర్: భువనేశ్వర్-హౌరా జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (12074) రైలు బోగీ కింద మంటలు చెలరేగాయి. కటక్ రైల్వేస్టేషన్‌లో గురువారం ఉదయం ఈ ఘటన సంభవించింది. భువనేశ్వర్ నుంచి హౌరా వెళ్తుండగా మార్గమధ్యలో ఉదయం 6.30 గంటల ప్రాంతంలో మంటలను గుర్తించారు. కటక్ రైల్వేస్టేషన్ 2వ నంబర్ ప్లాట్‌ఫాంలో ఆగినప్పుడు కోచ్ కింద మంటలు ప్రయాణికుల దృష్టికి వచ్చింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న రైల్వే రక్షక దళం ఆర్పీఎఫ్ ఘటన స్థలాన్ని సందర్శించి, అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలు నివారించారు. మంటల నివారణ పూర్తయ్యేవరకు ప్రయాణికులను రైలు నుంచి దించేశారు. సుమారు 30 నిమిషాల కసరత్తుతో యథాస్థితికి రావడంతో రైలులోకి ఎక్కేందుకు ప్రయాణికులను అనుమతించారు. రైల్వే ఇంజినీర్ల సాంకేతిక పరీక్ష తర్వాత రైలు రవాణా పునరుద్ధరించారు.

బ్రేక్ బైండింగ్

బ్రేక్ బైండింగ్ కారణంగా (చక్రం నుంచి బ్రేక్ విడుదల కాని పరిస్థితి) బోగీ కింద మంటలు చెలరేగినట్లు తూర్పు కోస్తా రైల్వే అధికార ప్రతినిధి వెల్లడించారు. కటక్ రైల్వేస్టేషన్ 2వ నంబర్ ప్లాట్‌ఫాంలో ఉదయం 6.30 గంటలకు ఈ పరిస్థితి వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. చక్రం నుంచి బ్రేక్‌ని విడుదల చేయడంతో యథాస్థితికి చేరుకుంది. ఈ ప్రక్రియ ముగించి తిరిగి రైలు కటక్ నుంచి ఉదయం 7.15 గంటలకు బయల్దేరింది. బ్రేక్ ఎందుకు విడుదల అవ్వలేదనే కారణాలను పరిశీలిస్తున్నారు. కోచ్ లోపల ఎటువంటి మంటలు లేవని తూర్పు కోస్తా రైల్వే (ఈ–కోర్) స్పష్టం చేసింది.

వివాహిత ఆత్మహత్య



శారద మృతదేహం (ఇన్‌సెట్లో) భర్త శంకరరావుతో శారద (ఫైల్)

రాయగడ: స్థానిక కస్తూరీనగర్ మొదటి లైన్‌లో నివసిస్తున్న ఎస్.శారద (32) అనే వివాహిత మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం తన ఇద్దరు పిల్లలను స్కూల్‌కు పంపించిన అనంతరం ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. స్కూల్ నుంచి వచ్చిన పిల్లలు ఇంటి తలుపులు కొట్టగా తీయకపోవడంతో గమనించి ఇరుగుపొరుగు వారిని పిలిచారు. దీంతో అక్కడి వారు ఇంటి తలుపులను తెరిచి చూసేసరికి ఆమె ఇంటి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నట్లు గుర్తించారు. మృతురాలు, ఆమె భర్త శంకరరావు, పిల్లలు మూడు రోజుల క్రితమే విశాఖపట్నం వెళ్లారు. అనంతరం బుధవారం శారద పిల్లలను తీసుకొని రాయగడకు తిరిగి రాగా, శంకరరావు విశాఖపట్నంలో ఉండిపోయారు. వారిద్దరి మధ్య కొద్ది రోజులుగా మనస్పర్థలు ఉన్నట్లు సమాచారం.

8 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కల కట్టలు

బరంపురం: గంజాం పోలీసుస్టేషన్ పరిధి బొటకలి గ్రామంలో రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడిచేసి, 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి మహేంద్ర కుమార్ సాహు తెలిపిన వివరాల మేరకు గంజాం పోలీసుస్టేషన్ పరిధి బొటకలి గ్రామంలో ఉన్న ఒక ఇంటిలో కొద్ది రోజులుగా జూదం అడ్డా నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్పీ జగమోహన్ మీనా ఆదేశాలతో గంజాం పోలీసులు ఆ ఇంటిపై దాడిచేసి 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.65 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలు, రెండు పేకకట్టలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

అయ్యో..!



తండ్రీ, కొడుకుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం



లక్ష్మణ మండల్(ఫైల్)



వేణు మండల్(ఫైల్)

- తండ్రి అంత్యక్రియలకు కట్టెలు కొడుతూ కుమారుడు దుర్మరణం

జయపురం: జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. అప్పటివరకు కళ్లముందే కనిపించే వ్యక్తుల మరణవార్తను మరుక్షణమే వినాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. తండ్రి మృతదేహాన్ని దహనం చేసేందుకు కట్టెలు కొడుతున్న కుమారుడు సైతం చెట్టుపై నుంచి పెద్దకొమ్మ తలపై పడడంతో మరణించిన విషాదకర ఘటన జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి కమతా గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కమతా గ్రామంలో నివాసముంటున్న లక్ష్మణ మండల్ కొన్నేళ్లుగా కొరాపుట్‌లో టిఫిన్ షాపుతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి అతడి భార్య చేదోడుగా ఉంటూ దుకాణం నడిపేందుకు సహకరించేంది. అయితే లక్ష్మణ మండల్ అనారోగ్యానికి గురవ్వడంతో ఇటీవల ఆస్పత్రిలో చేరాడు. దీంతో అతడి కుమారుడు వేణు మండల్ దుకాణం బాధ్యతలు చేపట్టాడు. అతడు తన తల్లి, తండ్రి, తమ్ముడు, చెల్లి బాధ్యతలు చేపట్టి పోషిస్తున్నాడు. కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణ మండల్ గురువారం ఉదయం మరణించాడు. దీంతో తండ్రి మృతదేహానికి దహన సంస్కారాలు చేయాలని భావించి కమత గ్రామానికి తీసుకొచ్చారు. దీనికోసం తమ ఇంటి వెనుకనున్న చెట్టు కొమ్మలు కొడుతుండగా పెద్దకొమ్మ వేణు తలపై పడింది. అందువలన అతడి తల రెండుగా చిట్లింది. దీంతో కుటుంబ సభ్యులు కంగారుపడి వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వేణుని పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం తెలిసిన బిసింగపూర్ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం తండ్రీ, కుమారుల మృతదేహాలకు పక్కపక్కనే దహన సంస్కారాలు నిర్వహించారు.

క్లుప్తంగా

విరిగిన కొండ చరియలు



రోడ్డుపై విరిగిపడిన కొండ చరియలు

కొరాపుట్: జిల్లాలోని నారాయణపట్న సమితిలో కొండ చరియలు విరిగిపడ్డాయి. గురువారం ఉదయం తుల గుమ్మండి గ్రామ పంచాయతీ నక్తి పాదర్ ఘాట్ రోడ్డులోని పొడ పాదర్ గ్రామానికి సమీపంలో అకస్మాత్తుగా పెద్దపెద్ద రాళ్లు కిందకి దొర్లుకుంటూ వచ్చి, పింజీఎస్‌పై రోడ్డుకి అడ్డంగా పడ్డాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎటువంటి నష్టం సంభవించలేదు. వెంటనే సమితి కేంద్రం నుంచి అధికారులు వెళ్లి రాళ్లని తొలగించారు. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ఈ ఘటన సంభవించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఆంధ్రా–ఒడిశా వివాదస్పద ప్రాంతం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియాకి వెళ్లే మార్గంలో కూడా కొండపై నుంచి రాళ్లు జారుతూ వస్తున్నాయి. దాంతో అధికారులు అప్రమత్తత ప్రకటించారు.

సెంట్రల్ యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించండి

- లోక్‌సభలో కొరాపుట్ ఎంపీ ఉల్కా



పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్న ఎంపీ సప్తగిరి ఉల్కా

కొరాపుట్: జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ఒడిశా సెంట్రల్ యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్‌కి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కా విజ్ఞప్తి చేశారు. గురువారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. అనేక పోరాటాల అనంతరం 2009లో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం వర్సిటీ ప్రారంభించిందన్నారు. కానీ మూడేళ్ల వరకు అధ్యాపకులను నియమించలేదన్నారు. అనంతరం పార్లమెంట్‌లో ప్రశ్నలనంతరం నియమాకాలు ప్రారంభించారన్నారు. సుమరు 14 ఏళ్ల అనంతరం ప్రస్తుతం ప్రొఫెసర్ల కొరత ఏర్పడిందని వెల్లడించారు. కేవలం అవుట్ సోర్సింగ్ ద్వారా అధ్యాపకులను కొనసాగిస్తున్నారన్నారు. దీంతో వేల సంఖ్యలో విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, దీనిపై కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. భవనాల నిర్మాణంతో విద్య సాధ్యం కాదని, అధ్యాపకులను నియమిస్తేనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే జయపూర్‌లో కేంద్రీయ విద్యాలయం నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఏర్పాటు చేయాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్ రేపు

జయపురం: జాతీయ న్యాయ సేవా ప్రదీకరణ, రాష్ట్ర న్యాయ సేవా ప్రదీకరణల ఆదేశం మేరకు ఈనెల 9వ తేదీన కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి సమన్ జెన శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కోర్టులోనూ, కొరాపుట్, కోట్‌పాడ్, బొరిగుమ్మ, సెమిలిగుడ, దశమంతపూర్, లమతాపుట్, లక్ష్మీపూర్ తదితర కోర్టుల్లో ఆరోజు అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమిల్, మోటారు ప్రమాదాల పరిహార కేసులు, బ్యాంకు రుణ కేసులు, విద్యుత్, నీటి సరఫరా కేసులు, కుటుంబ సమస్యలు, కార్మిక సంబంధిత కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రెవెన్యూ, కౌలుదారు కేసులు, భూవివాదాలు, భూసేకరణ, ఉపాధి మొదలగు కేసుల విచారణలు జరుగుతాయని వెల్లడించారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వలన కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని పేర్కొన్నారు. అందువలన అవసరమైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. న్యాయ సేవా సదన్‌లో గురువారం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం కోసం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, ఈ పరీక్షలు చేస్తే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బగాది శాంతి శ్రీ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కేవీ రమణ, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, సీడీపీఓ శోభ పాల్గొన్నారు.



ఐటీ సోదాల్లో బయటపడిన నోట్ల కట్టలు

రెండోరోజు కొనసాగిన

ఐటీ దాడులు

- మద్యం వ్యాపారాలే లక్ష్యంగా సోదాలు
- మొత్తం రూ.150 కోట్లు స్వాధీనం

భువనేశ్వర్: రాష్ట్రంలో లిక్కర్ బ్రూయింగ్ కంపెనీ బౌద్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సంబంధం కలిగిన వివిధ ప్రాంగణాల్లో రెండోరోజు గురువారం ఏకకాలంలో ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారుల దాడులు కొనసాగాయి. బొలంగీర్ జిల్లా బాలదేవ్ సాహు గ్రూప్ ఆఫ్ కంపెనీల కార్యాలయాల్లో ఐటీ సిబ్బంది సోదాలు చేశారు. ఈ సోదాల్లో ఇప్పటివరకు రూ.150 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ముందుగా ఒడిశా, జార్ఖండ్‌లోని బౌద్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆదాయపు పన్ను శాఖ బుధవారం దాడులు నిర్వహించి కంపెనీతో సంబంధం ఉన్న ప్రాంగణాల్లో భారీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకుంది. ఒడిశాలోని బోలంగీర్, సంబల్‌పూర్, జార్ఖండ్‌లోని రాంచీ, లోహర్‌దగాలో సోదాలు కొనసాగుతున్నాయి.

భాగస్వామిగా బాలదేవ్ గ్రూప్ కంపెనీలు

బౌద్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో బాలదేవ్ సాహు గ్రూప్ ఆఫ్ కంపెనీలు భాగస్వామిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాలదేవ్ సాహు ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ (ఫ్లై యాష్ బ్రిక్స్ కార్ఖానా), క్వాలిటీ బాట్లర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంఎఫ్‌ఎల్ బాట్లింగ్ యూనిట్), కిషోర్ ప్రసాద్ బిజయ్ ప్రసాద్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సహా వివిధ ఐఎంఎఫ్‌ఎల్ బ్రాండ్‌ల విక్రయం, మార్కెటింగ్ ఇతర వ్యాపారాలను బాలదేవ్ సాహు గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో భాగస్వాములుగా గుర్తించారు. బొలంగీర్ పట్టణంలోని సుదాపాడ, టిట్లాగఢ్ పట్టణంలోని మరో ఇద్దరు మద్యం వ్యాపారుల ఇళ్లపై కూడా ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ రెండు చోట్లా అప్రకటిత నగదును స్వాధీనం చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టిట్లాగఢ్‌లో ఇద్దరు మద్యం వ్యాపారులు దీపక్ సాహు, సంజయ్ సాహు ఇళ్లలో కూడా ఐటీ సోదాలు జరిగాయి.

సుందర్‌గఢ్‌లో సర్గిపాలిలోని ఇల్లు, కార్యాలయం, దేశీయ మద్యం డిస్టిలరీపై ఆదాయపు పన్ను బృందం బుధవారం దాడులు చేసింది. భువనేశ్వర్ పలాసపల్లి ప్రాంతం బౌద్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ కార్యాలయంలో కూడా సోదాలు చేపట్టారు.



నోట్ల కట్టలతో నింపిన బ్యాగులు

పంటనష్టం అంచనా వేయండి

- 12వ తేదీలోగా వివరాలు అందాలి
- ప్రత్యేక సహాయ కమిషనర్ సత్యబ్రత సాహు ఆదేశం



తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన పంటను తీస్తున్న రైతులు

భువనేశ్వర్: మిచాంగ్ తుఫాన్ రాష్ట్రంలో పలుచోట్ల తీవ్ర పంటనష్టం కలిగించింది. దీంతో క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్లకు ప్రత్యేక సహాయ కమిషనర్ సత్యబ్రత సాహు ఆదేశించారు. ఈ మేరకు సమగ్ర నివేదిక ఈనెల 12వ తేదీలోగా దాఖలు చేయాలని గడువు కేటాయించారు.

సంయుక్త పరిశీలన

క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అన్ని శాఖలు సంయుక్తంగా పరిశీలించాలని ఆదేశించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ, వ్యవసాయం, రైతు సాధికారత శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ జరిపి క్షేత్రస్థాయి అంచనా వేయాలని కలెక్టర్లకు రాసిన లేఖలో సత్యబ్రత సాహు కోరారు. 33 శాతం కంటే అధికంగా నష్టపోయిన పంట విస్తీర్ణాన్ని నిర్ధారించేందుకు ప్రత్యక్ష అంచనా నిర్వహించాలని స్పష్టం చేశారు. పట్టణాలు, మండలాలు, గ్రామ పంచాయతీలు, గ్రామాల వారీగా నివేదికను సమర్పించాలని తెలిపారు. పంట నష్టం అంచనా పురస్కరించుకుని ప్రభావిత రైతుల పొలం భౌగోళిక వివరాలు (ఆర్ ఓఆర్) భూలేఖ్ నుంచి ధ్రువీకరించడం అనివార్యమని పేర్కొన్నారు. కలెక్టర్లు రైతు వారీగా ప్రభావిత పొలం విస్తీర్ణం, పంట నష్టం అంచనా వివరాలు దాఖలు చేయాలని స్పష్టం చేశారు. ఈ నివేదిక ఆధారంగా బాధిత వర్గాలకు విపత్తు పరిహారం మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

సిబ్బంది సెలవులు రద్దు

తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో సంభవించిన పంటనష్టం తక్షణమే అంచనా వేయాల్సి ఉంది. రెవెన్యూ, వ్యవసాయం, రైతు సాధికారిత అధికార వర్గాలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో అంచనా నిర్వహించాలని ప్రత్యేక సహాయ కమిషనర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో అనుబంధ అధికార, సిబ్బంది వర్గాలకు ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు, ఈ వ్యవధిలో ద్వితీయ శని, ఆదివారాల్లో సెలవులు రద్దు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, రైతు సాధికారిత శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఆర్‌సీ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఈనెల 11వ తేదీ నాటికి విభాగానికి క్షేత్రస్థాయి పంట నష్టం నివేదిక దాఖలు చేయాలని ఈ ఉత్తర్వులు పేర్కొన్నాయి. మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, గజపతి, గంజాం, కలహండి, కంధమల్, నవరంగపూర్ జిల్లాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి.

'పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి'

మల్కన్‌గిరి: రైతులు పండిస్తున్న పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఐ జిల్లా అధ్యక్షుడు బ్రోజా మాఝి అన్నారు. జిల్లాలోని చిత్రకొండ సమితిలో ఆయన నేతృత్వంలో సీఎంకు ఉద్దేశిస్తూ 8 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ టి.పద్మనాభ దొరకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే రోజువారీ కూలీ రూ.600 అందజేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు చిత్రకొండ అంబేడ్కర్ వీధి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు



ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు

రహదారి నిబంధనలు పాటించాలి

జయపురం: ప్రయాణాలు చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మలో నిర్వహిస్తున్న శూన్య మృత్యు వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. బొరిగుమ్మ పోలీసులు, భారతమాల అధికారులు సంయుక్తంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని గ్రామాల్లో ప్రజలకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి డ్రైవ్ చేయకూడదని, సీటు బెల్ట్‌లు ధరించాలని, డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు సెల్‌ఫోనులో మాట్లాడకూడదని సూచించారు. బైక్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీసు హవల్దార్ సత్య రంజన్ నాయక్, మనోరంజన్ బెహర తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం





చిత్రకళ ప్రదర్శనను ప్రారంభిస్తున్న బౌరి తదితరులు



అబ్బురపరిచిన చిత్రకళా ప్రదర్శన

రాయగడ: రాష్ట్ర భాష, సాంస్కృతిక విభాగం ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శన అబ్బురపరిచింది. గురువారం రాయగడ చేరుకున్న మొబైల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ వాహనానికి జిల్లా సాంస్కృతిక విభాగం అధికారి సుచరిత బౌరి, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియం ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ చిత్రకళా ప్రదర్శనను వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిత్రకళా విశిష్టతను చూసి ఆనందించారు. ఈ సందర్భంగా బాగ్ మాట్లాడుతూ రాష్ట్ర భాషా, సంస్కృతికి అద్దంపట్టే ఈ చిత్రాలను ప్రదర్శించడంతో విద్యార్థుల్లో చిత్రకళా నైపుణ్యానికి మరింత ప్రోత్సాహం కలుగుతుందన్నారు. ప్రదర్శనలో జిల్లాలోని నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదిమ తెగకు చెందిన డొంగిరియా ఆదివాసీల సాంప్రదాయ ఇడితాల్ చిత్రాలు కూడా చోటు సాధించడం గమనార్హం.



ప్రదర్శనలో ఉంచిన చిత్రాలు



చిత్రాలను తిలకిస్తున్న విద్యార్థులు

రోడ్డెక్కిన గజరాజుల గుంపు

- స్తంభించిన రాకపోకలు

భువనేశ్వర్: జాతీయ రహదారిపై గజరాజుల గుంపు. ఢెంకనాల్ జిల్లాలో ఇది కొత్త విషయం కానప్పటికీ తాజా దృశ్యం విభిన్నంగా తారసపడింది. సాధారణంగా చీకటి వేళలో ఢెంకనాల్ జిల్లా ఒడాపాడా మండలం గొయిలో కూడలి, రాసాసింగ్, హల్దియా బహల్ పరిసర ప్రాంతాల్లో 55వ నంబరు జాతీయ రహదారి నడి బొడ్డున ఏనుగుల సంచారం దాదాపు నిత్యం కనిపించే దృశ్యమే. తొలిసారిగా ఉదయం వేళలో ఈ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచారం బెంబేలెత్తించింది. 55వ నంబర్ జాతీయ రహదారికి ఒకవైపు నుంచి మరోవైపుకు 25 ఏనుగుల గుంపు దాటుతున్న దృశ్యం తారసపడింది. దీంతో ఏనుగులు రోడ్డు దాటే వరకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికుల భద్రత దృష్ట్యా జాతీయ రహదారి దాటుతుండగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలు కలకలం రేపకుండా జాగ్రత్త వహించారు. దాదాపు అరగంట తర్వాత, ఏనుగులు గుంపు తరలిపోవడంతో రహదారిపై రాకపోకలు కొనసాగాయి.



రోడ్డు దాటుతున్న ఏనుగుల గుంపు



ఖాకీలకు సవాల్

వేసవి కాలం కాదు. జనం డాబాల మీదకు వెళ్లే సీజనూ కాదు. ఇంటిల్లిపాదీ యాత్రలకు వెళ్లే సమయం అంత కంటే కాదు. కానీ దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా హస్త లాఘవం చూపిస్తున్నారు. చలి కాలంలో చెమటలు పుట్టిస్తున్నారు. భారీ చోరీలతో పోలీసులకు సవాల్ విసురుతున్నారు. మరోవైపు ఖాకీలు కూడా చోరుల పని పట్టేందుకు సమర్థంగా సన్నద్ధమవుతున్నారు. అర్ధరాత్రిళ్లు కూడా ఊళ్లతో పాటు దారుల్లోనూ నిఘా పెంచుతున్నారు.



రాత్రి గస్తీల్లో భాగంగా ఎస్పీ రాధిక

- భారీ చోరీలతో పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- చోరుల కదలికలపై పోలీసుల నిఘా
- బయట గ్యాంగులు జిల్లాలోకి వచ్చాయని అనుమానం
- బీట్‌లు, నైట్ గస్తీల పెంపు



శ్రీకాకుళం క్రైమ్ : దొంగలు చేతివాటం చూపిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో శ్రీకాకుళం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో రెండు చోట్ల, నరసన్నపేటలో రెండు చోట్ల చోరీలకు పాల్పడి ప్రజలను ఆందోళనకు గురి చేశారు. వీరు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిని పట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు జిల్లావాసులను కూడా అప్రమత్తం చేస్తున్నారు. పోలీసులకు సహకరించాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఇప్పటికే దొంగల వివరాలు తెలిసేలా ఫ్లెక్సీలను ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. దీంతో పాటు కార్డన్‌సెర్చ్‌లను కూడా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

గస్తీ పటిష్టం..

జిల్లాలో మూడు సబ్‌డివిజన్‌లు, 12 సర్కిల్ కార్యాలయాలతో కలిసి 34 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. గస్తీల్లో భాగంగా ముఖ్య నగరాలు, పట్టణాల్లో ఏడు గంటల నుంచి ఉదయం ఏడు వరకు సర్కిల్ పరిధిలో ఆరు నుంచి ఎనిమిది బీట్లు (ఇందులో లస్కర్ బీట్లు రెండు), గ్రామీణ మండలాల పరిధిలో మూడు నుంచి నాలుగు పోలీసు బీట్లు పాల్గొంటాయి.

ఒక్కో బీటుకు ఒక కానిస్టేబుల్, హోంగార్డు ఉంటారు. ఎస్‌హెచ్‌వో(ఎస్ఐ స్థాయి) తనిఖీ చేస్తుంటారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్‌డివిజనల్ అధికారి (డీఎస్పీ) దగ్గరుండి పర్యవేక్షిస్తుంటారు. జిల్లా కంట్రోల్ రూం ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వీరిని అలెర్ట్ చేస్తుంటుంది. ఈ మధ్య కాలంలో ఎస్పీ రాధిక బీట్ సిస్టంలో సమూల మార్పులు చేశారు. రాత్రి గస్తీల్లో సీఐలు, డీఎస్పీలు డ్యూటీలు చేయాలని ఆదేశించారు. అంతే కాక సర్‌ప్రైజ్ చెకింగ్ అంటూ ఆమే స్వయంగా రాత్రి గస్తీల్లో పాల్గొంటూ బీటుల్లో ఉన్న(నగరాల్లోను, హైవేల్లోను) పోలీసులు ఏ విధంగా విధులు నిర్వర్తిస్తున్నారన్నది తనిఖీ చేస్తున్నారు. అడిషనల్ ఎస్పీ కూడా వెళ్తున్నారు. అంతర్‌రాష్ట్ర దొంగలు జిల్లాలోకి ప్రవేశించారనే అనుమానంతో బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాల్సిందే..

పోలీసులు దొంగల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. మరోవైపు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు. ముఖ్యంగా బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించడం, ముఖ్యమైన పత్రాలు, నగదు, బంగారం లాకర్లలో పెట్టుకోవడం, ఇంటికి లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం ద్వారా పోలీసుల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, అనుమానిత వ్యక్తుల గురించి పోలీసులకు తెలియజేయడం చేయాలని కోరుతున్నారు. జిల్లాలో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఇప్పటివరకు 9,883 మంది డౌన్‌లోడ్ చేసుకోగా.. 498 మంది వినియోగించుకున్నారు. దీని సాయంతో పోలీసులు ఇంటి వద్ద సీసీ కెమెరా పెట్టి గస్తీ కాస్తారు. మరీ ముఖ్యమంగా బంగారం, వెండి మెరుగు పెడతామనే వారితో జాగ్రత్తగా ఉండాలి. కొత్తగా ఎవరైనా టెంట్లు వేసి వ్యాపారాలు, సర్కస్, తదితర వినోద కార్యక్రమాలు నిర్వహిస్తే తప్పనిసరిగా పోలీసులు, మహిళా కానిస్టేబుల్‌కు తెలియజేయాలి.

అప్రమత్తమయ్యాం..



ఈ మధ్య కాలంలో వరుస చోరీలు జరగడంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ ఆదేశాలతో చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టాం. బీట్ సిస్టంలోనూ మేడమ్ సమూల మార్పులు చేశారు. అధికారులంతా రాత్రి గస్తీల్లో పాల్గొంటున్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించాలని ప్రజలను అవగాహన పరుస్తున్నాం. 50 ఎల్‌హెచ్‌ఎంఎస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. సర్కిల్‌కు ఐదు చొప్పున ఇస్తాం. ప్రజలు పోలీసులకు సహకరిస్తే చోరీలకు అడ్డుకట్టవేసేందుకు వీలుంటుంది. – టీపీ విఠలేశ్వరరావు, జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్)



క్లుప్తంగా

చినమేరంగి పోలీస్‌స్టేషన్ సందర్శన



చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్‌ను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం సందర్శించారు. వార్షిక తనిఖీ నిమిత్తం స్టేషన్‌ను సందర్శించానని తెలిపారు. ఈ సందర్భంగా చినమేరంగి సీఐ ప్రసాద్, ఎస్సై కళాధర్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌వో, రైటర్, కంప్యూటర్, సిబ్బంది గదులను పరిశీలించారు.కేస్ ప్రాపర్టీ భద్రపరచిన గదులు, సీజ్ చేసిన వాహనాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను, క్రైమ్ రికార్డులను, కేసు నమోదు నుంచి డిస్పోజల్ వరకు గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల స్థితిగతులను పరిశీలించారు.పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసుల ఫైల్స్, స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ,డ్యూటీ రోస్టర్,ప్రాపర్టీ రిజిస్టర్, కోర్టుకు సంబంధించిన రికార్డ్స్ పరిశీలించారు.కేసుల దర్యాప్తు విధానం,పురోగతి గురించి ఆరా తీసి, సదరు కేసుల ఛేదింపు విషయంలో దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ఎస్.ఎం.డి అజీజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాటిపూడిలో మహిళ కోసం గాలింపు




బుచ్చి అప్పారావు జలాశయంలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

గంట్యాడ: గెడ్డలో కొట్టుకుపోయిన ఓ మహిళ కోసం తాటిపూడి(గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం) వద్ద ఏపీఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు గాలింపు చేపట్టారు. అనంతగిరి మండలం భీమపోలు గ్రామానికి చెందిన ముగ్గురు ఉవ్వ గెడ్డ దాటుతుండగా వరద ప్రవాహానికి కొట్టుకుపోయారు. వారిలో మిరియాల జన్ని కుమార్ (25), గమ్మెల లక్ష్మి(55) మృతదేహాలు లభ్యమయ్యాయి. మిరియాల కమల(45) ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బుచ్చి అప్పారావు జలాశయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ గాలింపు చేపట్టింది.

వ్యాన్, లారీ ఢీ: డ్రైవర్‌కు గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం స్వీట్ హోం సమీపంలో బుధవారం రాత్రి వ్యాన్, లారీ ఢీకొన్న సంఘటనలో వ్యాన్ డ్రైవర్ శివాజీకి స్వల్ప గాయాలయ్యాయి. గజపతినగరం నుంచి రామభద్రపురం వెళ్తున్న వ్యాన్‌ను మరడాం నుంచి గజపతినగరం వెళ్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయాలపాలైన డ్రైవర్‌ను గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పెదమానాపురం ఎస్సై శిరీష వద్ద ప్రస్తావించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గ్యాస్ లీకైన ప్రమాదంలో మరో మహిళ మృతి



ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనంలో చికిత్సకు తరలిస్తున్న శ్రావణి (ఫైల్)

లక్కవరపుకోట: మండల కేంద్రం లక్కవరపుకోటలోని గవర వీధిలో గత నెల 19వ తేదిన గ్యాస్ లీకై ఇల్లు పేలిపోయిన ఘటనలో ఇద్దరు మహిళలతో పాటూ ముగ్గురు చిన్నారులు తీవ్రంగా కాలిపోయిన విషయం పాఠకులకు విదితమే. ఈ ప్రమాదంలో మరో మహిళ కె.శ్రావణి (30) గురువారం మృతి చెందినట్లు ఎస్సై ముకుందరావు తెలిపారు. క్షతగాత్రులంతా విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తామరాపల్లి వెంకటలక్ష్మి(50) గత నెల 29న మృతి చెందింది. కాగా చికిత్స పొందుతున్న ముగ్గురు చిన్నారుల పరిస్థితి కూడా ఆందోళన కరంగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీల రాష్ట్ర సమ్మె తాత్కాలిక వాయిదా

విజయనగరం పూల్‌బాగ్: అంగన్‌వాడీల రాష్ట్ర సమ్మె తాత్కాలికంగా వాయిదా పడినట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు వి.లక్ష్మి, అధ్యక్షురాలు బి.పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనసూయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి సమ్మె తలపెట్టిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో ఎక్కువ జిల్లాల్లో తుఫాన్ ప్రభావం వల్ల ప్రజలు కష్టాల్లో ఉన్నారు. పంటలు నష్టపోయి, కొన్ని చోట్ల ఇళ్లు కోల్పోయారు. అంగన్‌వాడీ సెంటర్లు కూడా నీటమునిగాయి. బాధితులకు ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో భోజనాలు, వసతులు ఏర్పాటు చేసింది. కాబట్టి అంగన్‌వాడీలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నీటి ఆదాకు నిధులు

- ప్రభుత్వ భవనాల వద్ద వర్షపునీటి నిల్వకు హార్వెస్టింగ్‌లు
- జగనన్నకాలనీల్లో ఇంకుడు గుంతలు
- జిల్లా వ్యాప్తంగా నిధుల మంజూరు



రాజాం మండలంలోని రాజయ్యపేట గ్రామ సచివాలయ సముదాయం వద్ద హార్వెస్టింగ్ స్ట్రక్చర్

రాజాం: నీటిని ఆదా చేయడంతో పాటు గ్రామాల్లో స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వినూత్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో చేపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రకృతి వనరులను కాపాడుకుంటూ భవిష్యత్ జీవనానికి మార్గాలు రూపొందిస్తోంది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా వర్షపు నీటి వృథాను అరికట్టి, గ్రామాల్లో అపరిశుభ్రతను పారదోలేందుకు చర్యలు చేపట్టింది.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు

జిల్లాలో అన్ని గ్రామ సచివాలయాలు ప్రభుత్వ భవన సముదాయాలతో కళకళలాడుతున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రజలు కార్యాలయాలకు వస్తున్నారు. వారికి అవగాహన కల్పించడంతో పాటు ఇక్కడ వర్షపు నీటిని పొదుపుచేసే విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను సచివాలయాల సముదాయాల వద్ద నిర్మిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా 324 స్ట్రక్చర్లు మంజూరు కాగా, ఇప్పటివరకూ 81 స్ట్రక్చర్లను పూర్తిచేశారు. ఇవి పెద్ద తరహా ఇంకుడుగుంతలు మాదిరిగా ఉంటాయి. సచివాలయ భవన సముదాయాల వర్షపునీరు నేరుగా ఈ నిర్మాణాల్లోకి చేరుతుంది. వీటి నిర్మాణానికి ఒక్కోదానికి రూ. 64,000 నిధులు ఎన్ఆర్‌ఈజీఎస్ కేటాయించింది.

4,876 ఇంకుడు గుంతలు

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల నిర్మాణం చకచకా జరుగుతోంది. వీటి నిర్మాణంతో కొత్తగా గ్రామాలే ఏర్పడుతున్నాయి. ఈ కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంతల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ గుంతల నిర్మాణానికి లబ్ధిదారుకు ఎన్ఆర్‌ఈజీఎస్ రూ.6 వేలు చెల్లిస్తోంది. వర్షపునీటితో పాటు వాడుక నీరు ఇందులోకి వెళ్లడం ద్వారా నీటి ఆదా జరగనుండడంతో పాటు, మురుగునీటి సమస్య గట్టెక్కనుంది.

ప్రతి గ్రామంలో సోప్ బిట్

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మురుగుసమస్య ఎక్కువవుతోంది. ఆయా గ్రామాల్లో మురుగు కాలువల ద్వారా వచ్చే నీరు శివారు ప్రాంతాల్లోని పంటపొలాలు, చెరువుల్లో చేరి పరిసరాలు కలుషితమవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ సోప్ బిట్ల నిర్మాణానికి పలు గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. జిల్లాలోని 206 గ్రామాల్లో వీటిని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేయగా, ఒక్కోగ్రామానికి రూ. 58వేల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణంతో ఆయా గ్రామాల మురుగునీరు ఈ బిట్లులోకి చేరి, గ్రామాల్లో పరిశుభ్రత కనిపించనుంది.



సంతకవిటి మండలం తాలాడలో మోడల్ సోప్ బిట్

నిధులు మంజూరు

జిల్లాలో రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, ఇంకుడు గుంతలు, సోప్ బిట్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పలు మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లుకు అవగాహన కల్పించాం. ఆయా గ్రామాల్లో సచివాలయాలు వద్ద హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభమైంది.

జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ, విజయనగరం

బుచ్చి అప్పారావు విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



గొర్రిపాటి బుచ్చి అప్పారావు విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు విగ్రహం ఏర్పాటుకు తాటిపూడి జలాశయం (బుచ్చిఅప్పారావు జలాశయం) వద్ద గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం స్థల పరిశీలన చేశారు. ఏడున్నర అడుగుల విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. బుచ్చి అప్పారావు విగ్రహం అన్ని వైపులా కనించేవిధంగా నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆ తర్వాత తాటిపూడి జలశయాన్ని పరిశీలించారు. రబీకి నీరు ఇచ్చే విధంగా జలాశయంలో నీరు ఉందని సంతృప్తి వెలిబుచ్చారు. జలాశయంలో ఉన్న లీకులను పూర్తి స్థాయిలో అరికడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంధిరామునాయుడు, పార్టీ జామి మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, ఎంపీడీఓ భవాని, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఇరిగేషన్ ఏఈ తమ్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు నారాయణమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

1000 సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర, సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సారా రవాణా, తయారీ కేంద్రాలపై నిరంతరం దాడులు నిర్వహిస్తున్నామని ఎస్ఈబీ సీఐ ఎల్. ఉపేంద్ర అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మండలం ములగ గ్రామం సమీపంలో సారా రవాణాపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం నుంచి పార్వతీపురం మైదాన ప్రాంతాలకు సారా రవాణా చేస్తున్న పార్వతీపురం మండలం బిల్లగుడ్డివలస గ్రామానికి చెందిన కొండగొర్రి నగేష్‌ను అదుపులోకి తీసుకుని 1000ప్యాకెట్ల సారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని తెలిపారు.

22కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ సలీమ్‌ను అరెస్టు చేసి, 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైల్వేస్టేషన్ సమీపంలో ఉదయం 10 గంటల సమయంలో బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో గంజాయి ప్యాకెట్లు గుర్తించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన ఎస్సై భాస్కరరావు, సిబ్బందిని సీఐ అభినందించారు.

బంగారం దొంగ అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురంటౌన్: మహిళల మెడలో బంగారు చైన్లను చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు పార్వతీపురం మన్యం జిల్లా క్రైం పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఈ మేరకు పట్టుబడిన దొంగను గురువారం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరుల ముందుంచారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణారావు మాట్లాడుతూ 2023 జనవరి నుంచి నవంబరు వరకు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో మహిళల మెడలో చైన్ల చోరీకి సంబంధించి దొంగలు మన రాష్ట్రానికి చెందిన వారా లేదా అన్న కోణంలో క్రైం పోలీసులు దర్యాప్తు చేశారన్నారు. ఈ 11 నెలల కాలంలో పార్వతీపురంలోని చర్చివీధి, జనశక్తి కాలనీ, రామానంద్ నగర్, వైకేఎం కాలనీతో పాటు బొబ్బిలిలో జరిగిన బంగారు చైన్ల దొంగతనాలకు ఒకే వ్యక్తి పాల్పడినట్లు క్రైం పోలీసులు నిర్ధారించారన్నారు. చోరీలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, ఎలా దొంగతనం చేశాడనే విషయంపై క్రైం పోలీసులు విస్తృతంగా పరిశోధన చేసి పట్టుకున్నారని తెలిపారు. చివరకు పార్వతీపురం పట్టణంలోని పెద్దాకలి వీధికి చెందిన బుక్కూరు లక్ష్మణరావు చోరీలకు పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఐదు కేసులకు సంబంధించి చోరీకి పాల్పడిన నిందితుడి నుంచి 9.2 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ సుధాకర్‌తో పాటు పట్టణ హెచ్‌సీ రాజశేఖర్, సీసీఎస్ హెచ్‌సీలు నారాయణ, గోవింద్, పీసీ ఉదయ్‌లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించినట్లు సీఐ తెలిపారు.

వాహన చోదకుడిపై కేసు నమోదు

పాలకొండ రూరల్: మండలంలోని మంగళాపురం వద్ద నాగావళి నదిపై గల వంతెనపై నడుస్తున్న వ్యక్తులను వెనుకనుంచి బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జీఎం.పురానికి చెందిన నల్లబారిక గురుమూర్తి మరికొందరు బుధవారం రాత్రి నడుస్తుండగా రేగిడి అమదాలవలస మండలానికి చెందిన ద్విచక్రవాహన చోదకుడు గేదెల సురేష్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో గాయాలపాలైన గురుమూర్తిని మెరుగైన వైద్యసేవల కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పై పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్ గురువారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

తుఫాన్ మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: అల్లూరి జిల్లాలో తుఫాన్ ప్రభావంతో వరదల్లో కొట్టుకుపోయిన పలువురు కుటుంబాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు గురువారం పరామర్శించారు. అనంతగిరి మండలం భీంపోలు సమీపంలోని ఉవ్వా గెడ్డలో కొట్టుకుపోయిన సీతపాడు గ్రామంలోని ముగ్గురు గిరిజనులు మిరియాల కమల, గెమ్మెల లక్ష్మి, కుమార్ కుటుంబాలను కలిసినట్లు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్లు



ఎంపికైన క్రీడాకారులతో వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ స్త్రీ, పురుష విభాగాల జట్లను జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రకటించింది. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల యూనివర్సిటీ అనుబంధ కళాశాల జీఎంఆర్ ఐటీ కళాశాల రాజాంలో జరిగిన అంతర యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు ప్రతిభ చూపడంతో తుదిజట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. స్త్రీల, పురుషుల జట్లలో ఎంపికైన వారిలో బి.ప్రశాంత్ (విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), ఎం.భార్గవ రాజు గుప్త (గొన్నా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సైన్స్), ఐ.సతీష్ (ఐతం కాలేజ్, టెక్కలి), ఎ.వినయ్‌కుమార్ (డైట్ కళాశాల అనకాపల్లి), కె.మౌనీష్ (జీఎంఆర్ ఐటీ, రాజాం), హెచ్.పూజిత (ఐతం, టెక్కలి), వై.ప్రజ్ఞాకుమారి (లెండి కాలేజీ, విజయనగరం) ఉన్నారు. ఎంపికైన జట్టు సభ్యులను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏవీపాపారావు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ డాక్టర్ కె.నాగరాజు, ఎం.ఎల్లారీశ్వరి అభినందించారు.

కార్యదర్శుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఆదేశాల మేరకు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం విద్యనభ్యసించిన అభ్యర్థులు వారి సాంఘిక కేటగిరిలో కటాఫ్ మార్కుల కంటే ఎక్కువ సాధించిన వారు అర్హులుగా పేర్కొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు

- రాజీవ్ క్రీడా మైదానం వేదికగా మూడు రోజుల పాటు నిర్వహణ
- హాజరు కానున్న వివిధ జిల్లాలకు చెందిన 500 మంది క్రీడాకారులు
- సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో పోటీ



ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు సాధన చేస్తున్న క్రీడాకారులు

విజయనగరం: క్రీడల ఖిల్లా విజయనగరం రాష్ట్రస్థాయి పోటీలకు అతిథ్యమిచ్చేందుకు సిద్ధమైంది. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే అంతర్‌జిల్లాల పోటీలకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియం వేదిక కానుంది. జిల్లాలో మొట్టమొదటి సారిగా ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో ఈ పోటీలు నిర్వహించనుండగా..పోటీల్లో అతిథ్య విజయనగరం జిల్లా క్రీడాకారులతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనున్నారు. ఈ నెల 8,9,10 తేదీల్లో పోటీల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు అవసరమైన భోజన, వసతి సదుపాయాలు సమకూర్చారు. రాష్ట్రస్థాయి (అండర్-14) పోటీలు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానుండగా..9వ తేదీ సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా క్యాడెట్ (అండర్-17) విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు 10వ తేదీన బహుమతులు అందజేయనున్నారు.

జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు

రాష్ట్రస్థాయిలో సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో జిల్లా వేదికగా నిర్వహించే ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో 18 మంది క్రీడాకారులు, క్యాడెట్ విభాగంలో 22 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

క్యాడెట్, సబ్‌జూనియర్స్ విభాగాల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారుల ఎంపికను రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో భాగంగా చేపట్టనున్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19,20,21 తేదీల్లో గుజరాత్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారి ప్రసాద్ తెలిపారు.

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో గురాన అయ్యలు, వేణుగోపాలరావులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 8 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. రాష్ట్రం తరపున పోటీపడిన కుశాల్, పునీత్, సాత్విక్, కె.సాహిత్యలు వెండిపతకాలు కైవసం చేసుకోగా..సంకీర్తన, గుణదీప్, వి.దేవన్, మణికంత, చరిష్మాలు కాంస్య పతకాలు చేజిక్కించుకుని విద్యలనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు చేరుకున్న క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

1334 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత



గరుడుబిల్లిలో సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం బస్తాలు

బొండపల్లి: మండలంలోని ముద్దూరు, గరుడుబిల్లి గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన 1334 కేజీల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ గురువారం సాయంత్రం తెలిపారు. ముద్దూరు గ్రామంలో వడ్డాది శ్రీనివాసరావు ఇంట్లో 10 బస్తాల్లో నిల్వ చేసిన 499 కేజీల బియ్యంతో పాటు, గరుడుబిల్లి గ్రామంలో బండారు శ్రీనివాసరావు ఇంట్లో 19 బస్తాల్లో నిల్వ చేసిన 835 కేజీల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని ఆయా గ్రామాల డీలర్లకు అప్పగించినట్లు చెప్పారు. బియ్యం నిల్వ చేసిన ఇద్దరు నిందితులపై 6ఏ కేసు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదిక అందచేసినట్లు తెలిపారు.

గిరిజన వర్సిటీలో యువసంఘం ఫేజ్-3 ప్రారంభం



ఎక్స్‌పోజర్ టూర్ బృందం బస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: న్యూఢిల్లీలో పదిరోజుల పాటు నిర్వహించే ఎక్స్‌పోజర్ టూర్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న 45 మంది విద్యార్థులు, నలుగురు అధ్యాపకుల బృందం బస్సును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ -యువ సంఘం కార్యక్రమంలో భాగంగా వారంతా వెళ్తున్న సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ భిన్న భాషలు, విభిన్న ఆలోచనా విధానాలు, విభిన్న ఆహారపు అలవాట్లు ఉండవచ్చు కానీ మనమందరం హృదయంతో ఐక్యంగా ఉన్న భారతదేశ ఆత్మలమన్నారు.

యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి మాట్లాడుతూ అద్భుతమైన జాతీయవాద కార్యక్రమంలో యూనివర్సిటీ బృందం చేరడం సంతోషంగా ఉందన్నారు. యువసంఘం అనేది విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) కింద ఒక చొరవ అని, ఇది 'ప్రజల నుంచి ప్రజల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడం, మన దేశంలోని రాష్ట్రాల యువత మధ్య సానుభూతిని పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో సుసంపన్నమైన, వైవిధ్యమైన వారసత్వం గురించి తెలుసుకుంటూ సాంస్కృతిక అవగాహన పెంపొందించడానికి, ఆలోచనల మార్పిడికి యువకులకు ఇది వేదికగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కివాడే, యూనివర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి

- కలెక్టర్, జేసీలతో సమావేశంలో అధికారులకు జెడ్పీ చైర్మన్ సూచన



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో రైతుల నుంచి తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులను ఆదుకొనేందుకు వీలుగా నిబంధనలు సడలించే అవకాశం ఉన్నందున జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువచ్చేటప్పుడు వాటిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవలసి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించి చర్చించారు. జిల్లాలో కొన్ని మండలాల్లో భారీ వర్షాల కారణంగా పొలాల్లో కుప్పలుగా వేసిన ఉన్న వరి పంట కొంత మేరకు దెబ్బతిన్నదని తేమ శాతం విషయంలో కొంతమేరకు నిబంధనలు సడలించి కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. వారం రోజుల అనంతరం రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలన్నింటినీ వెంటనే తెరచి సిద్ధం చేయాలని పౌర సరఫరాల సంస్థ అధికారులకు సూచించారు. జిల్లాలో తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు విషయంలో రైతాంగానికి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు వెంటనే చర్యలు చేపడదామన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల తేదీలు ఖరారు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీలకు వేదికలు, తేదీలు ఖరారైనట్టు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పివిఎల్ఎన్.కృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఏలూరులోని ఏఎస్ఆర్ డీఎస్ఏ స్టేడియంలో త్రోబాల్ పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు విజయనగరం రైల్వేస్టేషన్ వద్దకు హాజరు కావాలని సూచించారు.

విశాఖ జిల్లా నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు హాకీ అంతర్ జిల్లాల పోటీలు జరగనున్నట్టు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 11న ఉదయం 10 గంటలకు విజయనగరం రైల్వేస్టేషన్ వద్దకు హాజరు కావాలని కోరారు.